క్లుప్తంగా

హామీలు అమలు చేయాలి

రామగిరి(నల్లగొండ): విద్యాశాఖలో సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మొలుగూరి కృష్ణ, బొమ్మగాని రాజు డిమాండ్ చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ వందలాది ఉద్యోగులు విధుల్లో ప్రమాదాలతో, అనారోగ్యాలతో ప్రాణాలు కోల్పోయిన ప్రభుత్వం ఒక్క రూపాయి బాధిత కుటుంబాలకు ఇవ్వలేదన్నారు. విధుల్లో ఉండి మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటకృష్ణ వెంకటేశ్వర్లు మంగ నిరంజన్ బొమ్మరాగోని సైదులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : పట్టణంలోని మొండి వారి కాలనీలోని నిరుపేద కుటుంబానికి చెందిన గోపగాని శిరీషా ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కూతుర్లు అనాథలు కావడంతో వారి జీవనోపాధికి ఇబ్బంది పడుతున్నారు. శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గోపగాని సోమయ్య, భాస్కర్, ఎడ్ల లక్ష్మయ్య, ఎడ్ల కవిత, ఆవుల ముత్యాలమ్మ, ఆవుల స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రాజన్ గురుస్వామి భజన మండలి ఏర్పాటు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని అన్ని భజన బృందాల కలిపి రాజన్ గురుస్వామి భజన మండలిగా శనివారం ఏర్పాటు చేశారు. స్థానిక రామగిరి అయ్యప్ప స్వామి ఆలయంలో అన్ని భజన బృందాలు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజన్ గురుస్వామి భజన మండలి పేరును ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు. భజన మండలి అధ్యక్షుడిగా నల్లగొండ జిల్లాలో మొట్టమొదటి అయ్యప్ప మాలధారులు కలిశన్ రాజన్ గురుస్వామి తనయుడు కలిశన్ అశోక్, ప్రధాన కార్యదర్శిగా కంజర శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సురకారపు యాదగిరి గౌడ్, కోశాధికారిగా టంగుటూరి నరేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. ఈ కార్యక్రమంలో యలిజాల శంకర్, భాషపాక హరీష్, పెరిక సుశీల్ కుమార్, తవ్వోజు హరి, గొట్టుముక్కల మల్లికార్జున్, వేముల హరి, సాయినాద్, విజయ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.


నగదు రహిత వైద్యం అందించాలి



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న నేతలు

నల్లగొండ టౌన్ : రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్యాన్ని అందించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్లా శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీని విడుదల చేయాలని, డీఏను దసరా పండుగ నాటికి విడుదల చేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు పెన్షనర్లకు జన్మదినం సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్.అంజనేయులు మండల అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాదా వాసుదేవ్, గాయం నారాయణరెడ్డి, జెల్లా పుల్లయ్య, రఘునాథం, కేశవాచారి, పాండురంగం, తాడూరి రమేష్, రవిప్రసాద్, బిక్షం, శంకర్‌రెడ్డి, ఎం.వెంకట్ రెడ్డి, శ్రీవిద్య, ముత్తమ్మ, వెంకళ్‌రావు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచే వరకు పోరాటం ఆగదు



నిరసనలో పాల్గొన్న పింఛన్‌దారులు, నేతలు

నకిరేకల్ : పింఛన్లు పెంచే వరకు తమ పోరాటం ఆగదని ఎమ్మార్పీ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం అన్నారు. నకిరేకల్‌లో 17,19 వార్డుల్లోని పింఛన్‌దారులతో శనివారం సమావేశం నిర్వహించిన అనంతరం నిరసన తెలిపారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 22నెలలుగా పింఛన్ల పెంపు కోసం ఎదురుచూస్తున్న వితంతులు, వృద్ధాప్య, వికాలంగులు, ఇతర పింఛన్‌దారులకు ప్రభుత్వం మొండి చెయ్యి చూపిస్తోందన్నారు. గత ఎన్నికల ముందు పెన్షన్లు పెంచుతామన్న హామీలను అమలు చేయక పోతే కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈపెన్షన్ల పెంపు కోసం ఈనెల 15న అన్ని మండల, మున్సిపల్ కేంద్రాల్లో ధర్నాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికాలంగుల సంఘం నాయకులు వంటిపాక అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రత కరువైన పాఠశాలలు

- ప్రహరీల కోసం ఎదురుచూపులు
- ఆవరణలోకి పందులు, జంతువులు రాక
- ఆకతాయిలకు అడ్డాగా క్రీడా మైదానాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మునుగోడు : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో భద్రత కరువైందన్నారు. పాఠశాలలకు చక్కటి మైదానాలు ఉన్నా వాటిలో విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు అనేక అవస్థలు పడాల్సి వస్తుంది. ప్రహరీ లేకపోవడంతో ఆ మైదానంలోకి పశువులు, పందులు వచ్చి అక్కడే మల, మూత్ర విసర్జన చేస్తున్నాయి. అంతే కాకుండా సాయంత్రం 4 గంటల తరువాత పాఠశాల మూసివేయడంతో రాత్రి సమయంలో ఆయా గ్రామాలల్లోని ఆకతాయిలు ఆ పాఠశాల మైదానం, తరగతి గదులను తమ దురు అలవాట్లకు అడ్డగా మార్చుకుంటున్నారు. అనేక మంది మైదానంలో మద్యం సేవించడం తదితర కార్యక్రమాలను మైదానంలో కొనసాగిస్తున్నారు. అదే ప్రహరీ ఉండి ఉంటే అందులోకి ఆకతాయిలు వెళేలందుకు వీలు లేకుండా ఉంటుందని పలువురు వాపోతున్నారు.



ప్రహరీ లేని ఎల్లలగూడెం ప్రాథమిక పాఠశాల

ఆరు పాఠశాలలకు..

మండల వ్యాప్తంగా ఉన్న 28 గ్రామాల్లో మొత్తం 42 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అయితే వాటిలో 2606 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అందులో 28 పాఠశాలలకు పూర్తిగా ప్రహరీ నిర్మాణం చేశారు. మిగతా వాటిలో 8 పాఠశాలల్లో పాక్షికంగా సగం వరకు నిర్మించి వదిలేయగా ఆరు పాఠశాలలకు మాత్రం పూర్తిగా ప్రహరీ లేదు. అవి జెడ్పీహెస్ఎస్ ఊకొండి, ప్రాథమిక పాఠశాల బీరేల్లిగూడెం, కాశావారిగూడెం, మదనాపురం, కలవ్యకుంట్ల, వెల్మకన్నె, తుర్కగూడెం, దుబ్బకాల్వ తదితర పాఠశాలలు ఉన్నాయి. దీంతో ఆ పాఠశాలల్లో భద్రత కరువైంది. పలు గ్రామాలల్లో ఆకతాయిలు తరగతి గదులల్లోకి వెళ్లి ఫర్నిచర్ సామగ్రిని దొంగిలిస్తున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని ప్రహరీ లేని పాఠశాలలకు నిర్మించి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నివేదికలు పంపాం

మండలంలోని ఆరు పాఠశాలలకు అసలు ప్రహరీ లేవు. అదే విధంగా మరో 8పాఠశాలలు అసంపూర్తిగా నిర్మించారు. వాటిని పూర్తిస్థాయిలో నిర్మించేందుకు అవసరమైయిన నిధులు మంజూరు చేయించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. అవి మంజూరు కాగానే నిర్మింపజేస్తాం.

– మల్లేషం, మండల విద్యా అధికారి

మొక్కలు పశువులు తింటున్నాయి

మా పాఠశాలకు ప్రహరీ లేకపావడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. మైదానంలో మొక్కలు నాటితే వాటిని పాఠశాల లేని సమయంలో పశువులు తింటున్నాయి. అంతే కాకుండా ప్రహరీ లేని కారణంగా ఇతర సమస్యలు తలెత్తున్నాయి. ప్రహరీ ఉంటే బాగుంటుంది.

–జి. వెంకన్న గౌడ్, హెచ్‌ఎం

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



ప్రైవేట్ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో ట్రస్మా నకిరేకల్ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రవేట్ పాఠశాలలో పని చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను శనివారం సన్మానించారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మొట్ట మొదటిసారిగా నకిరేకల్ కేంద్రంగా ట్రాస్మా ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి ఉమ్మడిగా సన్మానించడం అభినందనీయమన్నారు. ట్రస్మా మండల అధ్యక్షుడు ఎర్ర శంభులింగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మార్కెట్, మున్సిపల్ చైర్ పర్సన్లు గుత్తా మంజుల, చౌగోని రజితా, ఎఈఓ మేక నాగయ్య, ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, ట్రస్మా మండల ప్రధాన కార్యదర్శి బి.కన్నయ్యగౌడ్, వివిధ ప్రవేట్ పాఠశాల కరస్పాండెంట్లు, ప్రిన్స్‌పాల్స్, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నకిరేకల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో శనివారం కేతేపల్లి, నకిరేకల్, కట్టంగూర్ ,నార్కట్‌పల్లి, చిట్యాల మండలాలకు చెందిని 207మంది లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్, మున్సిపల్ చైర్‌పర్సన్లు మంజుల, రజితా, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా కష్టాలు



నకిరేకల్ : మన గ్రోమోర్ సెంటర్ వద్ద యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

నకిరేకల్ : యూరియా కోసం రైతులకు ఇంకా అవస్థలు తప్పడం లేదు. శనివారం ఉదయం నకిరేకల్‌లోని మన గ్రోమోర్ సెంటర్‌కు 448 యూరియా బస్తాల దిగుమతులు కావడంతో ఆయా మండలాల్లోని రైతులు పెద్ద ఎత్తున వచ్చి తెల్లవారుజామ నుంచే తమ పట్టాధారు పాస్‌బుక్, ఆధార్ జీరాక్స్ ప్రతులను సెంటర్ ముందు వరుస క్రమంలోమ పెట్టి నిరీక్షించారు. సెంటర్ ముందు రైతులు అదిక సంఖ్యలో రావడంతో పోలీస్‌లు అక్కడికి చేరుకుని వారిని క్యూలైన్లు ఉండేలా చర్యలు చేపట్టారు. ఈసెంటర్‌లో 224 మంది రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున యూరియా అందించారు. మరో 200మంది రైతులు యూరియా అందక అక్కడే నిరీక్షిస్తున్నారు. మరో కొంత మంది రైతులు ఇంటి బాట పట్టారు.

శాలిగౌరారం : యూరియా కష్టాలు రైతులను నేటికి వెంటాడుతూనే ఉన్నాయి. మండలానికి శనివారం 70మెట్రిక్ టన్నులు(1554 బస్తాలు)యూరియా వచ్చింది. అందులో పీఏసీఎస్‌కు వచ్చిన 40 టన్నుల యూరియాలో ఎస్‌జికొత్తపల్లి రైతువేదిక వద్ద 20 టన్నులు, మాధారంకలాన్ రైతువేదిక వద్ద 20 టన్నులు రైతులకు విక్రయించారు. మండలకేంద్రానికి యూరియా వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు ఉదయం నుంచే ఆయా కేంద్రాల వద్ద యూరియా కోసం భారీగా క్యూలైన్ కట్టారు. ఈ విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి సిబ్బందితో ఉదయం ఆయా కేంద్రాలకు చేరుకొని పరిస్థితులను బట్టి రైతుకు రెండు బస్తాల చొప్పున టోకెన్ పద్ధతి ద్వారా 777 మంది రైతులకు యూరియాను అందించారు. దీంతో లైన్‌లో నిలుచున్న అనేకమంది రైతులకు యూరియా అందకపోవడంతో రైతులు నిరాశతో వెనుదిరిగిపోయారు.



శాలిగౌరారం రైతువేదిక వద్ద...

యూరియా పంపిణీ

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడెం రైతు సేవా సహకార సంఘానికి శుక్రవారం 19మెట్రిక్ టన్నుల యూరియా రాగా శనివారం సిబ్బంది ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తన సిబ్బందితో కలిసి యూరియా పంపిణీని పర్యవేక్షించాడు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుజాత, సంఘం సిబ్బంది బండి మధుగౌడ్, కిరణ్ పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

మర్రిగూడ : మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కార్మికులకు రూ.26వేల వేతనం అందిస్తామన్నారు. అనంతరం పంచాయతీ కార్మికుల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా రమావత్ రాజునాయక్, ప్రధాన కార్యదర్శిగా నక్క నరసింహా, ఉపాధ్యక్షురాలిగా పెరుమాళ్ల మంజుల, సహాయ కార్యదర్శిగా జిల్లా అమృత, కోశాధికారిగా మాదుగుల శ్రీనుతోపాటు మరో 11 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఊరి పక్క నరసింహా, వంపు ముత్తమ్మ, పద్మ, సుజాత, లింగయ్య, అలివేలు, వెంకటయ్య, పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సీఐటీయూ ఉద్యమం

కేతేపల్లి : కార్మికులు హక్కుల సాధన కోసం పాలక ప్రభుత్వాలపై ఉద్యమాలు నిర్వహించడంలో సీఐటీయూ ముందుంటుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం అన్నారు. శనివారం కేతేపల్లిలో నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్మికుల ఐదో మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పంచాయతీ కార్మికుల నూతన మండల కమిటీని ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా కోనేటి సైదులు, గౌరవ అధ్యక్షులుగా ఆదిమళ్ల సుధీర్, కోశాధికారిగా వంటల లింగయ్య, ఉపాధ్యక్షులుగా తాళ్ల సైదులు, పెరిక జ్యోతి, కార్యదర్శిగా మాందాసు సైదులు, సహాయ కార్యదర్శులుగా బొల్లె వెంకన్న, మనిమద్దె శోభతో పాటు మరో 16 మందిని కార్యవర్గ సభ్యులుగా ప్రకటించారు. ఏడాకుల కోటయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ నాయకులు ఎ.సుధీర్, పెంజర్ల సైదులు, లక్కపాక రాజు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

కేతేపల్లి : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పార్టీ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి పబ్బు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్ అధ్యక్షతన ×సేవాపక్షం× కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సెప్టెంబర్ 17న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా అక్టోబర్ 2 వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలను పార్టీ శ్రేణులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు ఎ.అనిత, నాయకులు చెరుకు నరేష్ పాల్గొన్నారు.

సోమిరెడ్డి ఆత్మహత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న యానాల శేఖర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): తుంగతుర్తి ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి ఏలేటి సోమిరెడ్డి రైలు కింద పడి ఆత్మహత్య ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఔట్‌సోర్సింగ్ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యానాల శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నెలల నుంచి వేతనాలు రాక ప్రతి రోజు ఉద్యోగానికి వెళ్లడానికి ఖర్చులు లేక ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించలేక మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడన్నారు. గతంలో కూడా ప్రతి నెలా వేతనాలు అందక జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు జరిగాయన్నారు. రాష్ట్రం ప్రభుత్వం నాలుగు నెలలుగా కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు చెల్లించలేదన్నారు. దీంతో ఉద్యోగులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎన్నికల్లో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగా ప్రతి నెలా వేతనాలు చెల్లించాలన్నారు. సోమిరెడ్డి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ప్రభుత్వం రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టేటి నాగయ్య, సందీప్, శంకర్, మురళి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసులు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవర్

నకిరేకల్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీ పడి సత్వర న్యాయం పొందవచ్చని నకిరేకల్ సివిల్ జడ్జి మంజుల సూర్యవర్ అన్నారు. నకిరేకల్ సీనియర్ సివిల్ కోర్టులో మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమె పాల్గొని మాట్లాడారు. లోక్‌అదాలత్ ద్వారా 103 సివిల్ కేసులు, తొమ్మిది జరిమాన కేసులు, క్రిమినల్ కేసులు 10, మద్యం సేవించిన ఇతర కేసులను పరిష్కరించారు. మొత్తం 1003 కేసుల గాను. రూ.7,61,400 జరిమానాలు విధించారు. స్థానిక జూనియర్ జడ్జి షేక్ ఆరీఫ్, శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, పోలీస్ లీగల్ వలంటీర్లు పి.వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల వేధింపుల నుంచి కాపాడండి

పంజగుట్ట : ఉన్నతాధికారుల వేధింపుల నుంచి తనను కాపాడాలని నల్లగొండ జిల్లా, హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు జూనియర్ లెక్చరర్ నీరుడు సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని వేడుకున్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రిటైర్డ్ హిందీ పండిట్ హరిహరనాథ్ గుప్తతో కలిసి ఆయన మాట్లాడుతూ .. కళాశాల ప్రిన్సిపాల్, మరో ఇద్దరు ఉన్నతాధికారులు తనపై కక్ష్యకట్టి వారిని కులం పేరుతో తాను వేధిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. తాను ఇదే విశయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా వారు ఎలాంటి విచారణ చేయకుండా వికారాబాద్‌కు బదిలీ చేశారని తెలిపారు. అక్కడ తెలుగు పోస్టు లేకపోవడంతో తాను హైకోర్టును ఆశ్రయించానని, కోర్టు బదిలీ ఉత్తర్వులు రద్దు చేస్తూ విచారణ జరిగేవరకు హాలియా కళాశాలలోనే విధులు కొనసాగించాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్న తాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఐదున్నర నెలల తరువాత పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. తననే కాకుండా ఎంతో మంది ఉద్యోగులను ఈ ఉన్నతాధికారులు వేధిస్తున్నారని వారిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న బాధితుడు సంజీవ రెడ్డి

భూ నిర్వాసితుల ముందస్తు అరెస్ట్

గట్టుప్పల్ : మంత్రి కోమటిరెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో శనివారం నల్లగొండకు తరలివెళ్తారనే సమాచారం తో రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసిత రైతులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు తరలించి.. బాధిత రైతులకు పోలీసులు మధ్యాహ్నం భోజనం పెట్టి వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. అరెస్టయిన వారిలో సిపిఎం నాయకులు చాపల మారయ్య, సీపీఐ మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, మోదుగు సత్తిరెడ్డి, బండారు అంజయ్య, గుమ్మకొండ అల్వాల్ రెడ్డి, మారయ్య, కట్ట వెంకన్న, వర్కాల యాదగిరి, చంద్రమౌళి, శేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



గట్టుప్పల్ పోలీస్ స్టేషన్‌లో భూ నిర్వాసితులు, నాయకులు

మర్రిగూడ: రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతుల నాయకుడు జిల్లా కిశోర్‌ను పోలీసులు శనివారం ముందస్తు అరెస్ట్ చేసి మర్రిగూడ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడారు. రీజినల్ రింగ్ రోడ్డు మొదటి అలైన్‌మెంట్ ప్రకారం భూస్వాములు, ప్రజా ప్రతినిధులు, బడా నాయకలు భూముల నుంచి వెళ్తుండడంతో వాటిని కాపాడుకునేందుకు నాయకులు దాన్ని రద్దు చేయించారన్నారు. కొత్త అలైన్‌మెంట్‌ను అమలు చేసేందుకు నిరుపేద, చిన్న సన్నకారు రైతులను ప్రభుత్వం అణచివేతకు గురి చేసి పేద రైతుల పొట్టకొడుతున్నారన్నారు. కొత్త అలైన్‌మెంట్‌ను వ్యతిరేకించాలని ఆయన కోరారు. అనంతరం కిశోర్‌ను పోలీసులు సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు.

నరోత్తంరెడ్డి సేవలు మరువలేనివి



నరోత్తంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన పార్టీ సీనియర్ నాయకుడు దివంగత చామల నరోత్తంరెడ్డి సేవలు మరువలేనివని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని పావురాలగూడెంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన చామల నరోత్తంరెడ్డి ద్వితీయ వర్ధంతికి ఎంపీ, ఎమ్మెల్యే హాజరయ్యారు. వల్లాల గ్రామంలో నిర్వహించిన అమర వీరుల స్మారక స్థూపావిష్కరణ కార్యక్రమానికి హాజరైన వారు రాత్రి నరోత్తంరెడ్డి వర్ధంతి వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారివెంట సూర్యాపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, నల్లగొండ డిసిసి ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు గుడిపాటి నర్సయ్య, స్థానిక సింగిల్‌విండో వైస్‌చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, మాధారంకలాన్ మాజీ ఎంపీటీసీ నోముల జనార్ధన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేశ్, నాయకులు రవీందర్‌రెడ్డి, దామోదర్, ఇబ్రహీంలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



కంచర్ల కృష్ణారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శనివారం నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ కంచర్ల కృష్ణారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు భవిష్యత్‌లో అవకాశాలోస్తాయన్నారు. పార్టీలో చేరిన వారిలో చింతల సైదమ్మ, కురుపటి లింగయ్య, కురుపాటి రామచంద్రం, ఇరుగు నరేష్, మట్టిపల్లి అంజయ్య, జనపాల లింగస్వామి, కోరబోయిన స్వామిలతో పాటు మరికొందరు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉయ్యాల నాగరాజుగౌడ్, మాజీ సర్పంచ్‌లు సుంకరి యాదగిరిగౌడ్, కంచర్ల శ్రీనువాస్‌రెడ్డి, నాయకులు సాగర్ల బిక్షం, సుంకరబోయిన నర్సింహ్మా, బిక్షం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

17న విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలి

నకిరేకల్ : ఈనెల 17న నిర్వహించనున్న భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలతోపాటు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న కోరారు. నకిరేకల్‌లో శనివారం నిర్వహించిన ఆపార్టీ పట్టణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు గర్రె మురళిమోహన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు పందాల సైదులు, చినేని జాని, గుడుగుంట్ల సాయన్న, బోనగిరి వేంకటేశ్వర్లు,సందుపట్ల వేణుమాదవ్, కారింగుల యాదగిరి పాల్గొన్నారు.

యూనిఫాం, దుప్పట్లు అందజేత

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జి. చినమునయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని వసతిగృహంలో అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు, బూట్లు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ వరికుప్పల రాజు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

నకిరేకల్ : మండలలోని చందంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు వర్ష్రుషా ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం స్కూల్ బ్యాగులను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం కనుకుంట్ల నవీన్‌రెడ్డి తన చిన్న నాటి స్నేహితుడు టి.రంజిత్ హైదరాబాద్‌లోని వర్ష్రుషా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలో గతేడాది కాలంగా జరుగుతున్న కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా చూసి తన కంపెనీ ఆధ్వర్యంలో రూ.50 వేల విలువగల స్కూల్ బ్యాగులను 62మంది విద్యార్థులకు అందజేశారు. ఆ పాఠశాల హెచ్‌ఎం కనుకుంట్ల నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ ఎస్తేరా, ఆకంపెనీ ప్రతినిధులు ఫణి, ఉపాధ్యాయులు బాలాజీ, వేదాంతం ఆదిత్య, వెల్మకంటా శ్రీహరి, వీరాస్వా, పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నకిరేకల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తు మండల, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని, ప్రమోషన్‌పై వెళ్లిన, పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులను శనివారం నకిరేకల్‌లో పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆ సంఘం మండలం అధ్యక్షుడు వంటల ఆనంద్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు భిక్షమయ్య, యాదయ్య, వెంకటేవ్వర్లు, కవితా పాల్గొన్నారు.

కళాశాలల బంద్‌కు ఎస్‌ఎఫ్‌ఐ మద్దతు

నల్లగొండ : నల్లగొండ: రాష్ట్రంలో పెండింగ్ ఫీజురీయంబర్స్ మెంట్స్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని ప్రైవేట్ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు చేపట్టిన బంద్‌కు ఎస్‌ఎఫ్‌ఐ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్ అన్నారు. ఆయన నల్లగొండలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మర్రిగూడ : విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధిత రైతు బేత లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం తన వ్యవసాయ ఎద్దు గ్రామ శివారులోని అబ్బనగోని వెంకటయ్య బత్తాయి తోట వద్ద గల విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతిచెందిందన్నారు. మృతిచెందిన ఎద్దు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, తనకు పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నారు.

ఆర్. కృష్ణయ్య జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్ : రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలను శనివారం స్థానిక పూలే విగ్రహం వద్ద పట్టణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుట్ట వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, టీడీపీ రాష్ట్ర నాయకులు ఎల్వియాదగిరి, బీసీ రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజుయాదవ్,బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూరెళ్ల విజయ్‌కుమార్, బక్కతట్ల వెంకన్నయాదవ్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'డీఈఓపై చర్యలు తీసుకోవాలి'

నాంపల్లి : నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిప్యూటేషన్లకు పాల్పడిన డీఈఓపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శంకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీఓ నంబర్ 25ను పాటించాలని అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలన్నారు. డీఈఓ స్పందించికపోతే డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని ఆయన తెలిపారు.